# బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## బీసీ మంత్రం ఓ జుమ్లా!

బీజేపీకి ప్రతి ఎన్నిక ఒక జుమ్లాగానే ఉంటుంది. అవి అసెంబ్లీ ఎన్నికలు కావచ్చు, లోక్‌సభ ఎన్నికలు కావచ్చు. ఒక్కోసారి స్థానిక సంస్థల ఎన్నికలు కావచ్చు. సామాజిక సమీకరణలను ఆయుధాలుగా చేసుకుని ప్రత్యర్థులపై యుద్ధం చేయడం ఆ పార్టీకి అనవాయితీగా మారింది. తెలంగాణ ఎన్నికల్లో కూడా ఇదే ఫార్ములా ప్రయోగిస్తున్నది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో ప్రధాని మోదీ బీసీ మంత్రం జపించడాన్ని ఈ కోణంలో నుంచే పరిశీలించాలి. వెనుకబడిన తరగతులకు అనేక విధాలుగా ప్రయోజనాలు కల్పించే కులగణనను అటకెక్కించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసం బీసీ సంక్షేమాన్ని ఎత్తుకోవడం విడ్డూరమే.

ఎన్నికల్లో గెలుపోటములను ప్రభావితం చేసే సామాజికవర్గాలపై కమలం పార్టీ కన్నేసింది. తెలంగాణ జనాభాలో 52 శాతంగా ఉన్న వెనుకబడిన తరగతులను ఆకర్షించడానికి వ్యూహాత్మకంగా ఎత్తులు వేస్తున్నది బీజేపీ. కిందటేడాది ఆగస్టులో రాజస్థాన్‌కు చెందిన జగదీప్ ధన్‌కర్‌ను ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేయడం కూడా బీజేపీ పొలిటికల్ గేమ్‌లో భాగమే. రాజస్థాన్‌లో జాట్‌లు బలమైన సామాజికవర్గం. దీంతో ఈనెలలో జరిగే రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముందుచూపుతో జగదీప్ ధన్‌కర్‌ను ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసింది. రాజస్థాన్‌లో జాట్ సామాజిక వర్గం కొంతకాలంగా బీజేపీకి దూరమైంది. 2018 రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి కారణం ఇదే. ఈ ఎన్నికల్లో ప్రధాని మోదీ మ్యాజిక్ పనిచేయలేదు. దాదాపు రెండేండ్ల కిందట మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దులో జరిగిన ఆందోళనల్లో కీలకపాత్ర పోషించింది జాట్లే. జాట్ సామాజికవర్గం మౌలికంగా వ్యవసాయంపై ఆధారపడ్డ సమూహం. కాగా నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా రైతులను పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన జగదీప్ ధన్‌కర్‌కు ఉప రాష్ట్రపతి పదవి ఇవ్వడం ద్వారా దేశంలోని రైతన్నల ఆదరణ పొందవచ్చన్నది బీజేపీ ఆలోచన. ఇదిలా ఉంటే, తాజాగా తెలంగాణలో పాగా వేయడానికి బీసీల జపం చేస్తున్నది.

తెలంగాణ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే బీసీ నేతనే ముఖ్యమంత్రి అవుతారని సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కులాలవారీగా జనాభా లెక్కలు తీయడంలో బీజేపీ రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నది. 2010లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా బీసీ జనాభాను లెక్కించాలని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ డిమాండ్ చేసింది. దీనికి స్పందించిన కాంగ్రెస్ ప్రభుత్వం కులాల వారీగా లెక్కలు తీయడానికి అంగీకరించింది. అప్పటికే జనాభా లెక్కల ప్రక్రియ మొదలైంది. దీంతో ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి కులాలవారీ జనాభా లెక్కలను తీయించింది కాంగ్రెస్ సర్కార్. అయితే రకరకాల కారణాలతో ఈ వివరాలు బయటకు రాలేదు. అధికారంలోకి వచ్చినంక బీజేపీ నాయకులు ఆ విషయాన్ని మరచిపోయారు. బీసీలకు సంబంధించిన లెక్కల వివరాలు లేకపోవడంతో రిజర్వేషన్ల శాతం నిర్ణయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఈ లెక్కలు స్పష్టంగా లేకపోవడం వల్లనే సుప్రీంకోర్టు, హైకోర్టులు రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించలేకపోతున్నాయి.బీసీ కమిషన్లు కూడా ఇబ్బందులు పడుతున్నాయి. 1931 తర్వాత ఎస్సీ, ఎస్టీ మినహా కులాలవారీగా జనగణన చేపట్టనే లేదు. వెనుకబడిన తరగతుల జనాభాపై ఇప్పటివరకు అంచనాలే తప్ప ఒక స్పష్టత అంటూ లేదు. దీంతో మొత్తం జనాభాలో వెనుకబడిన తరగతుల శాతం ఎంత అనేది ఒక అంచనాగానే మిగిలిపోతున్నది. కులగణన వంటి కీలకమైన అంశాలను బీజేపీ ఏమేరకు కాపాడగలదన్నది ప్రశ్నార్థకమే.

**ఎస్. అబ్దుల్ ఖాలిక్**
63001 74320

## యోధుల్లా కృష్ణార్జునులు

ఎక్కడెక్కడైతే యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు, అత్యున్నత విలుకాడైన అర్జునుడు ఉంటారో అక్కడ సకల ఐశ్వర్యం, సర్వ విజయం, సకల సమృద్ధి, ధర్మం ఉంటాయని భగవద్గీత చెప్పింది. తెలంగాణ ఎన్నికల కురుక్షేత్రంలో అభినవ కృష్ణార్జునుల్లా స్వారీ చేస్తున్నారు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు. ఈ బావబామ్మర్దులిద్దరూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం కోసం బాధ్యతను భుజానికెత్తుకుని కష్టపడుతున్నారు. మామకు తగ్గ అల్లుడు ఒకరైతే, తండ్రికి తగ్గ తనయుడు మరొకరు.

గత రెండు ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కేటీఆర్, హరీశ్‌రావులిద్దరూ చేసిన కృషి అందరికీ తెలిసిందే. ఈసారి కూడా ఇద్దరు అదే పనిలో ఉన్నారు. సీఎం కేసీఆర్ వ్యూహాలను గ్రౌండ్ లెవెల్‌లో అంతే స్థాయిలో అమలు చేయడంలో బావ బావమర్దులు ఎప్పుడూ ముందుంటారు. బీఆర్ఎస్ పార్టీని వెనుక ఉండి నడిపించే రెండు చక్రాలు వీరిద్దరు. ప్రతిపక్ష పార్టీల మాటలకు తూటాల వంటి సమాధానాలు ఇచ్చి మారు మాట్లాడకుండా చేయగల సమర్థులు వీరు. సీఎం కేసీఆర్ మనసెరిగి నడిచే వీరిద్దరూ రోజుకు 18 గంటలు శ్రమిస్తున్నారు. కాళ్లకు బలపం కట్టుకుని రాష్ట్రమంతా అవిశ్రాంతంగా పర్యటిస్తున్నారు. అధినేత చేతిలో బ్రహ్మాస్త్రాలై ప్రత్యర్థి పార్టీలకు గుబులు పుట్టిస్తున్నారు.

సాధారణ నాయకుల్లా భేషజాలకు పోకుండా కిందిస్థాయి కార్యకర్త నుంచి ప్రతి ఒక్కరిని పేరుపేరునా పలుకరిస్తూ ముందుకు సాగుతున్న తీరు వారి నాయకత్వ పటిమకు అద్దం పడుతున్నది. ఊరూరా కార్యకర్తలను గుర్తుపట్టి భుజం తట్టడం, సాధకబాధకాలను ఆరాతీస్తూ ఎక్కడ ఎటువంటి కష్టనష్టాలు ఎదురైనా వెంటనే అక్కడ వాలిపోయి సమస్యను సరిదిద్దటం వంటి పనులతో కృష్ణార్జునులు అగ్రస్థాయి నేతలుగా ఎదిగారు. ప్రతి పార్టీ ఎంత ఆర్భాటంగా ఎన్నికల ప్రచారం నిర్వహించినా పోలింగ్ సమయంలో మేనేజ్‌మెంట్ సరిగ్గా లేకపోతే బోల్తా పడుతుంది. కీలకమైన ఈ అంశంలో కేసీఆర్ వ్యూహాత్మక ప్రణాళికలను అమలు చేయడంలో కేటీఆర్, హరీశ్‌రావులను మించిన చాణక్యులు లేరనేది వాస్తవం. అధినేత ఆలోచనలో ఏముందో గుర్తించి తూచ తప్పకుండా ఆచరణలో పెట్టడంలో ఇద్దరూ ఇద్దరే.

> రాజకీయమైనా, ప్రభుత్వ వ్యవహారమైనా ఇద్దరూ కలిసి గోదాలోకి దిగిపోతారు. ప్రత్యర్థులను చీల్చి చెండాడటంలోనూ, పదునైన విమర్శలు సంధించడంలోనూ, దీటైన వ్యూహాలు రచించి అమలు చేయడంలోనూ ఎవరికి వారే సాటి. బుజ్జగింపులు, హెచ్చరికలతో దారికొస్తే సరి, లేదంటే తగ్గేదేలే అన్నట్టుగా దూసుకుపోవడమే ఆ ఇద్దరికీ తెలిసిన రాజకీయం.

సీఎం కేసీఆర్ తర్వాత వీరిద్దరూ బీఆర్ఎస్‌కు కర్త, కర్మ, క్రియ. ఒకరు హైదరాబాద్‌లో ఉంటే, మరొకరు జిల్లాల్లో, ఒకరు మెదక్‌లో ఉంటే, మరొకరు నల్లగొండలో, తూర్పు వైపు ఒకరు వెళితే, ఉత్తరాన చక్కబెట్టే వారు మరొకరు. అసంతృప్తులను బుజ్జగించడం, ఇతర పార్టీల నేతలను ఆకర్షించడం.. ఇలా అటూ ఇటూ రాజకీయం నెరుపుతూ అదుర్స్ అనిపిస్తున్నారు కేటీఆర్, హరీశ్‌రావులు.

సీఎం కేసీఆర్ నాలుగు నెలలు ముందుగానే అభ్యర్థుల జాబితాను ప్రకటించి విపక్ష పార్టీలకు షాక్ ఇచ్చారు. అభ్యర్థుల జాబితా ప్రకటించిన తర్వాత అసమ్మతి నేతలు భారీగా కాంగ్రెస్, బీజేపీలోకి వలస వస్తారని ఆ పార్టీ నేతలు ఆశించారు. కానీ కేటీఆర్, హరీశ్‌రావు తమ పదునైన వ్యూహాలతో ఆ రెండు పార్టీల ఆశలపై నీళ్లు చల్లారు. రాజకీయాల్లో తండ్రికి తగ్గ తనయుడిగా ఇప్పటికే నిరూపించుకున్నారు మంత్రి కేటీఆర్. ప్రధాని మోదీపై తీవ్ర విమర్శలు చేసిన కేటీఆర్.. తెలంగాణ సమాజాన్ని ఆలోచనలో పడేసేలా సూటిగా, స్పష్టంగా తన వాదన వినిపిస్తూ ఉంటారు.

రాజకీయాల్లోనే కాదు తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులపైనా, కంపెనీలను ఆకర్షించడంలోనూ కేటీఆర్ మార్క్ వేరు. ఇక, హరీశ్‌రావు కూడా ఏమాత్రం తగ్గడం లేదు. మామను మరోసారి సీఎం చేయడమే లక్ష్యంగా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. రాష్ట్రంలో మరేపార్టీకి లేని ఆయుధాలు వాళ్లు. యూత్ ఐకాన్, స్టైలిష్ పొలిటీషియన్ అని ఒకరిని, ఆరడుగుల బుల్లెట్, ట్రబుల్ షూటర్ అని మరొకరిని పార్టీ శ్రేణులు ఇష్టంగా పిలుచుకొంటారు.

**కోలేటి దామోదర్**
98491 44406

ఆగస్టు 21న బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ పార్టీ అభ్యర్థులను ప్రకటించినప్పటినుంచి మంత్రులిద్దరూ రాష్ట్రంలోని 64 అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టివచ్చారు. మంత్రుల సుడిగాలి పర్యటనలతో రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో చూసినా హ్యాట్రిక్ కొట్టాలన్న వజ్రసంకల్పం బీఆర్ఎస్ శ్రేణుల్లో తొణకిసలాడుతున్నది. బీఆర్ఎస్ శ్రేణుల సమరోత్సాహ ప్రదర్శనను చూసి కాంగ్రెస్, బీజేపీలు బెంబేలెత్తిపోతున్నాయి. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ.. సంక్షేమ ఫలాలు అనుభవించిన కుటుంబాలను నేరుగా కలుస్తూ బీఆర్ఎస్ పార్టీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో మూడో సారి అధికారాన్ని చేపట్టాల్సిన అనివార్యతలను ప్రజలకు వివరిస్తున్నారు.

తెలంగాణలో బీఆర్ఎస్‌ను నిలబెట్టేది ఈ కృష్ణార్జునులే అన్నది జగమెరిగిన సత్యం. మరి సీఎం కేసీఆర్ చరిష్మా, వీరి వ్యూహాలతో ఎన్నికల కురుక్షేత్రంలో బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం సునాయాసమేనని చెప్పడంలో సందేహం లేదు.

## మంచి చేసిండు మళ్లీ వస్తడు

తెలంగాణ రాష్ట్రంలో ఎవరినోట విన్నా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడ్డాయన్న చర్చలే. ప్రభుత్వ పథకాలు అందుకున్న లబ్ధిదారులు తమకు ఆసరానిచ్చిన ప్రభుత్వానికే జై కొడుతామంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉద్యమం నుంచి నేటి వరకు పేదల పార్టీ అని, ప్రజల సంక్షేమం కోసం పరితపిస్తుందని చెప్తున్నారు. నూటికి నూరుశాతం ఇది వాస్తవం. పుట్టిన పసి బిడ్డ నుంచి పండు ముదుసలి వరకు కులమతాలకతీతంగా అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం.

ఉద్యమ పార్టీగా అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర పాలనను కూడా ఉద్యమంగానే సాగించింది. తెలంగాణకు అత్యంత అవసరమైన తాగునీరు, సాగునీరు, విద్యుత్తును అతి తక్కువ సమయంలోనే సమకూర్చి పెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌ది. ఒకవైపు అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలను కూడా అదే రీతిలో అమలు చేశారు ముఖ్యమంత్రి కేసీఆర్.

తెలంగాణ రాష్ట్రం వ్యవసాయం మీద ఆధారపడ్డ రాష్ట్రం. అందుకే కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటగా రైతు, వ్యవసాయాభివృద్ధిపై దృష్టి సారించింది. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు, కుంటల పునరుద్ధరణ, మరమ్మత్తులు చేపట్టి అటు వ్యవసాయాన్ని ఇటు మత్స్య సంపద, జలసంపద సృష్టికి మార్గం సుగమం చేసింది. అందులో భాగంగానే దేశంలో ఎక్కడా లేని రైతు బంధు, రైతుబీమా, పంటల రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు జరిపి రైతులను ఆదుకున్నది. చివరి గింజ వరకు పంటను ప్రభు త్వం కొనుగోలు జరిపి రైతులు బలపడి ఎదగడానికి ఇతో ధికంగా తోడ్పాటు నందించి, బాధ్యతాయుత ప్రభుత్వం గా గుర్తింపు పొందింది.

దశాబ్దాల నీటి దోపిడికి గురైన తెలంగాణ ప్రజలను వ్యవసాయ పరంగా అభివృద్ధి పరచడానికి, పాలమూరు, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను, కాలువలను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి, భారీ, మధ్య చిన్న తరహా ప్రాజెక్టులను నిర్మించి, లక్షలాది ఎకరాల భూమిని సాగులోనికి తీసుకువచ్చి దండుగ అన్న వ్యవసాయాన్ని పండుగలా మార్చింది ప్రభుత్వం. మిషన్ కాకతీయ ద్వారా వందలాది చెరువులు నింపి వ్యవసాయానికి ఊతమిచ్చారు కేసీఆర్.

> మిషన్ కాకతీయ కింద చెరువులు మరమ్మతు చేసు కోవడం వల్ల ఇవాళ రాష్ట్రంలో చెరువులు నిండు కుండ ల్లా మారి, భూగర్భజలాలు పెరగడమే కాకుండా మత్స్య సంపద కూడా పెరిగింది.తెలంగాణ ప్రజల దాహార్తిని తీర్చడానికి మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నీరు వచ్చే విధానాన్ని చేపట్టి ప్రజల మన్ననలను అందుకున్నది కేసీఆర్ ప్రభుత్వం.

ఎక్కడా లేనివిధంగా రైతులకు ఉచితంగా తాగు, సాగునీరు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే. రైతాంగానికి 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్తు, ధరణి ద్వారా భూ రికార్డుల కంప్యూటరీకకరించి రైతులకు భూరక్షణ హక్కులు కల్పించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిది.

సంక్షేమ రంగంలోనూ వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, బోదకాలు బాధితులకు ఇలా అన్ని రంగాల వారికి పింఛన్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది. గురుకులాలు, జిల్లాకో మెడికల్ కాలేజీ, బస్తీ దవాఖానలు, పల్లె దవాఖానలు, హరితహారం, కంటివెలుగు, ఆసరా పింఛన్లు, దేవాలయాల నిర్మాణం ఇలా చెప్పుకుంటూ పోతే వందలాది పథకాలు ప్రవేశపెట్టిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం.

నేడు తెలంగా ణ అభివృద్ధి దేశానికే దిక్సూచి లా నిలిచింది. ఎవరినోట విన్నా కేసీఆర్ మాటనే. ఆయన చేసిన మంచిపనులే తిరిగి ఆయనను ముఖ్యమంత్రి చేస్తాయనటంలో ఎలాంటి సందేహం లేదు.

**మిద్దె సురేష్**
9701209355

### వారంతా తోలు బొమ్మలు...

## నేనే కీలుబొమ్మను

అతి విశ్వాసానికి, అహంకారానికి, ఆత్మవిశ్వాసానికి, ఆత్మన్యూనతకు తేడా తెలియని తనం కాంగ్రెస్ పార్టీలో కొట్టొచ్చినట్టు కనబడుతున్నది. 'పిల్ల పుట్టక ముందే కుల్లగుట్టినట్టు' అనే సామెతకు అద్దం పడుతున్నది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి డిసెంబర్ 9న తాను తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తానని డేట్, టైం ఫిక్స్ చేసుకొని, కార్డులు కూడా ఊరూరా పంచుతున్నట్టు కనిపిస్తున్నది. అయితే అది ప్రజల విశ్వాసాన్ని చూరగొనేందుకు చేస్తున్న ప్రయత్నమా? లేక ప్రజలను ఏమార్చే కుట్రతోనా? అన్నది లోతుగా ఆలోచిస్తే తప్ప అర్థం కాదు.

నిజానికి కాంగ్రెస్ పార్టీలో మిగతా వారంతా తోలుబొమ్మలని తను మాత్రమే కీలుబొమ్మ అని తన స్వయం ప్రకటనలు, ఆర్భాటాలు, హంగులతో రేవంత్‌రెడ్డి సొంత ప్రణాళికతో ఉన్నారని స్పష్టమవుతున్నది. ఒక మీడియా అధిపతి నిర్వహించిన ఇష్టాగోష్టిలో రేవంత్‌ను డ్రైవ్ చేస్తున్న తీరు, వెనుక నేపథ్యాన్ని అర్థం చేసుకుంటే తప్ప అసలు విషయం బోధపడదు. నిజానికి రేవంత్, సదరు మీడియాధిపతి, ఆయన వెనుక ఉన్న చంద్రబాబు నీడ భవిష్యత్తులో తెలంగాణను ఆగం చేస్తుందా? అన్నది తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది.

2018లో మహాకూటమి ముసుగులో రేవంత్ భుజంపై తుపాకి పెట్టి తెలంగాణ జనాన్ని కాల్చాలని చంద్రబాబు చేసిన ప్రయత్నాలను తెలంగాణ సమాజం పసిగట్టి ఏ స్ఫూర్తిని ప్రదర్శించిందో, అచ్చం అదే స్ఫూర్తిని మళ్లీ ప్రదర్శించవలసిన అవసరం ఏర్పడుతున్నది. గతంలో రేవంత్‌తో చెట్టపట్టాలేసుకుని తిరిగి ఇప్పుడు టీడీపీగానీ, చంద్రబాబుగానీ పోటీలో ఉంటే రేవంత్ పార్టీ గెలువడం కష్టమని తెలంగాణలో చాప చుట్టేసింది టీడీపీ. ఆ పార్టీకి మిగిలిన కాసిన్ని కమ్మ సామాజికవర్గపు ఓట్లు కాంగ్రెస్ పార్టీకే వేయాలని డిసైడ్ అయ్యారు. అందుకే చంద్రబాబు పరోక్ష సహకారం కాంగ్రెస్ పార్టీకే ఉన్నట్టు సదరు మీడియాధిపతి, రేవంత్ ఇంటర్వ్యూలో స్పష్టమైంది.

సీల్డ్ కవర్ సీఎం సంస్కృతి గల కాంగ్రెస్ పార్టీలో తను సీల్డ్ కవర్ సీఎంను కాదని, నేనే సీఎంను అని రేవంత్ చెప్పుకున్నారు. అంతేకాదు డిసెంబర్ 9న సంతకం చేసి వస్తా సాయంత్రం నాకు మీ చానల్‌లో అరగంట టైం ఇవ్వండనడాన్ని ఎలా చూడాలి? రేవంత్ అహంకార ప్రవర్తనతో కాంగ్రెస్ పార్టీలో ముసలం బయలుదేరింది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు తెలంగాణలో ఆరు గ్యారెంటీల పేరుతో ఊదరగొడుతూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తుంటే, మరోవైపు ముఖ్యమంత్రి నేనంటే, నేననే వాదన కొత్త పంచాయతీలు సృష్టిస్తున్నది.

**వెంకట్, గుంటిపల్లి**
94949 41001

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకలు రేవంత్ సీఎం అభ్యర్థిత్వానికి ఆమోదం తెలిపారా? నిజం గా రేవంత్‌కు ఆ హామీ ఇచ్చి ఉంటే పార్టీ సిద్ధాంతం ఎటు పోతున్నదనే చర్చ ఇప్పుడు పార్టీలో విస్తృతంగా సాగుతున్నది. ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్న క్రమంలో, ఆ పార్టీ సీనియర్లు గెలుపోటములపై తర్జనభర్జనపడుతున్న సందర్భంలో కాంగ్రెస్ పార్టీలో నేనే సీఎం..అనే అహంకారపు ధోరణి చూస్తుంటే 'శివ లింగం మీద తేలు' సామెత గుర్తుకొస్తున్నది. స్వయం ప్రకటిత సీఎం ప్రకటనను విని తెలంగాణ సమాజం నివ్వెరపోతున్నది. అధికారంలోకి రాకముందే ఇన్ని మాయలు చేస్తే రేపు రాష్ట్రాన్ని ఇంకెంత మాయ చేస్తారనే సందేహాలూ వ్యక్తమవుతున్నాయి.

తమ పార్టీలో 85 మంది అభ్యర్థులు సీఎం అభ్యర్థులేనని ప్రకటించిన రేవంత్ ఇప్పుడు ఆ 85 మంది తోలుబొమ్మలేనని చెప్పకనే చెప్తున్నారు. ఇప్పటికే ఎన్నికల ప్రచారాల్లో తన సహజ అహంకార ధోరణితో కార్యకర్తలను కాళ్లతో తొక్కుతూ, మెడలు పట్టి నెడుతూ, పిడిగుద్దులు కురిపిస్తున్నాడు. పార్టీ నాయకులు, కార్యకర్తలను పూచిక పుల్లల్లా తీసి పారేస్తున్న రేవంత్ తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారు. సీఎం రేసులో తామున్నామని ఇప్పటికే జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి విక్రమార్క, జగ్గారెడ్డి ఇలా ఎవరికి వారే ప్రచారం చేసుకుంటున్నారు.

పార్టీని ఏండ్ల తరబడి నమ్ముకున్న సీనియర్ నాయకులేం కావాలి? పారాచూట్ లీడర్ సీఎం ఎలా అవుతాడని కొంతమంది నాయకులు పార్టీ నేతలను సూటిగానే ప్రశ్నిస్తున్నారు. పదవులు కొనుక్కొనే అలవాటున్న రేవంత్ ఎందరికి డబ్బులిచ్చి ఉంటాడనే చర్చ పార్టీలో సాగుతున్నది. అంతేకాదు టీడీపీ నుంచి వచ్చిన తనవర్గాన్ని మాత్రమే గెలిపించుకొని, సీనియర్లు ఓడేలా తనదైన వ్యూహంతో ముందుకు సాగుతున్నట్టు తెలుస్తున్నది.

### జైత్రయాత్ర..!

ఎవరురా.. తెలంగాణ ఎడారిని
ఎదపై పెట్టుకొన్నది!
ఎవరురా.. రైతు వ్యథలను
గుండె కత్తుకొన్నది

ఎవరురా..ఎదిగిన ఆడపిల్లలకు
ఎదురేగి కల్యాణ లక్ష్మినిచ్చింది
ఎవరురా..కృష్ణమ్మను
ఎత్తిపోసింది!

ఎవరురా..కాళేశ్వరం
కాళ్లు కడిగింది!
ఎవరురా..రెండుగదుల
నివాసమిచ్చింది!

ఎవరురా.. చెరువులతో
చెలిమి చేసి చెలుకలతో
స్నేహం చేసి రైతులతో
పసిడి పంటలు పండించి
రైతుబంధు నిచ్చింది.

ఎవరురా! దిక్కుమొక్కులేని
దీన వృద్ధులకు
పింఛన్‌లు ఇచ్చి ఆదుకున్నది
ఒంటరి మహిళ లకు
వెన్నుదన్నైనిల్చింది

ఎవరురా..
దళితబంధు, బీసీబంధుతో
సబ్బండ కులాలకు దైవమైనది

ఎవరురా..
ఎవరెస్ట్ శిఖరాల మీద
జగజ్జేయమైన తెలంగాణను
నిల్పింది! నిజంచేస్తున్నదెవరు?

ఇంకెవరు?
తెలంగాణ తల్లి మానస పుత్రుడు
కల్వకుంట్ల చంద్రశేఖరుడు
జైత్రయాత్ర జయభేరితో
విజయధ్వానం మోగిస్తడు.

**డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి**
85558 99493

> ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించి తెలంగాణలో కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావటం తథ్యం. ఈ నేపథ్యంలో గెలుపు ప్రభావం కేవలం తెలంగాణకే కాకుండా, జాతీయ స్థాయిలోనూ చూపనున్నది. బీఆర్ఎస్ విజయంతో జాతీయ పార్టీ విస్తరణ మరింత వేగం పుంజుకోనున్నది. దీంతో దేశంలోని జాతీయ పార్టీల జాబితాలో బీఆర్ఎస్ కూడా చేరనున్నది.

> కేసీఆర్‌కు ప్రాంతీయ పార్టీలతో మంచి స్నేహ సంబంధాలున్నాయి. దేశంలోని రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, మిజోరాం రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. తెలంగాణలో మాత్రం ప్రాంతీయ పార్టీల్లో ఏ ఒక్కటి పోటీ చేయడం లేదు.

## తెలంగాణ గెలుపు దేశానికి మలుపు

ఇప్పటికే బీఆర్ఎస్ మహారాష్ట్రలో అడుగు పెట్టింది. అక్కడ బీఆర్ఎస్ ప్రభంజనంలా వ్యాపిస్తున్నది. బీఆర్ఎస్‌కు మరాఠా ప్రజలు నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తున్నది. అక్కడ పంచాయితీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బల పరిచిన అభ్యర్థులు విజయం సాధించారు.

దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు బలహీనపడుతున్నది. ఒక్క కర్ణాటకలో మొన్న బీజేపీపై కోపంతో కాంగ్రెస్‌ను గెలిపించారు ఆ రాష్ట్ర ప్రజలు. ప్రాంతీయ పార్టీలను వేధించడం కాంగ్రెస్, బీజేపీలకు అలవాటైంది. అందుకే దమ్మున్న నాయకుడు కేసీఆర్ జాతీయ స్థాయిలో ఉండాలనేది ప్రాంతీయ పార్టీల కోరిక. కేసీఆర్ ఇప్పుడు కొత్తగా జాతీయ నేతగా పరిచయం కావలసిన అవసరంలేదు. తెలంగాణకోసం కేసీఆర్ జాతీయ నాయకుడిగానే దేశ వ్యాప్తంగా అన్ని పార్టీలను కూడగట్టారు. అప్పటి నుంచి అనేక ప్రాంతీయ పార్టీల నాయకులతో కేసీఆర్‌కు దోస్తానా ఉన్నది. తెలంగాణ ఏర్పాటు కోసం అనేక పార్టీలు మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే.

నితీష్ కుమార్, కేజ్రీవాల్, మమతాబెనర్జీ, స్టాలిన్, అఖిలేష్ యాదవ్ తదితర నాయకుల కంటే ముందు చూపుతో వ్యవహరించే జాతీయ స్థాయిలో బలమైన నాయకుడు కేసీఆర్ అని చెప్పక తప్పదు. కేసీఆర్ ఉన్నాడనే ధైర్యం వారికి ఉన్నది. కాంగ్రెస్ ఎంత ఎదిగితే ప్రాంతీయ పార్టీలకు అంత నష్టం.

కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు దూరం చేసుకోలేరు. తెలంగాణకు పెద్ద దిక్కుగా కేసీఆర్ తప్ప మరొకరిని ఊహించలేం. అరవై ఏండ్లు కాంగ్రెస్ పార్టీ వల్ల ఎన్నో తరాల బిడ్డలకు నష్టం జరిగింది. రాష్ట్రం కోసం పేగులు ఎండ బెట్టుకుని పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రం సాధించిన యోధుడు కేసీఆర్. తెచ్చిన తెలంగాణను బంగారు తెలంగాణ చేసిం డు. పదేండ్లలో వందేండ్ల అభివృద్ధితో తెలంగాణ ముందుకు పోతున్నది. ఇలాం టి తరుణంలో తెలంగాణ ప్రజలు తమ బిడ్డవైపే ఉంటారు..

ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశానికి ఉన్నతమైన, విశ్వసనీయత గల కేసీఆర్ లాంటి నాయకుడు తప్పనిసరి. కాంగ్రెస్, బీజేపీలను ఎదుర్కొనేది కేసీఆరే. తెలంగాణను గెలిచేది కేసీఆరే. ప్రాంతీయ పార్టీలకు పెద్దన్నగా నాయకత్వం వహించేది కేసీఆరే.

> జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా దేశంలో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఆవిర్భవించిందన్నది తెలిసిందే. త